భర్తని చూడాలనే
ఆ భార్య కోరిక
ఎలా తీరింది?

# వీడని బంధం

కర్లపూడి విజయలక్ష్మి కథ

పార్వతమ్మ చేట్లో బియ్యం పోసుకుని పెరడువేపు కూచుని బియ్యంలో వున్న వడ్లగింజలు... మట్టిగడ్డలు ఏరిపారేస్తోంది. కాసేపటికి ఎక్కడ్నుండో రెండు పిచ్చుకలు వచ్చి వాలాయి. వడ్లగింజలోని బియ్యాన్ని తమ చిన్ని ముక్కుల్తో చకచకా వేరుచేసుకుని తింటున్నాయి.

పార్వతమ్మ వాటివేపు పరీక్షగా చూసింది. సరిగ్గా కన్పించలేదు. కళ్లద్దాలు తీసి పైట కొంగుతో బాగా తుడిచి పెట్టుకుని చూసింది. ఆడపిచ్చుక... మగ పిచ్చుక... ఎంతో ముచ్చటగా వుందా జంట.

తినటం అయిన తరువాత కిచ్... కిచ్ మంటూ శబ్దం చేస్తూ ముక్కులు పొడుచుకుంటున్నాయి. ఆ స్పర్శద్వారా తమ సంతోషాన్ని... అనురాగాన్ని... ప్రేమని పరస్పరం వ్యక్తం చేసుకుంటున్నాయి.

వాటి సరస సల్లాపాన్ని... అనురాగాన్ని గమనిస్తున్న ఆమె మనసు ఒక్కసారి బాధతో మూలిగింది. మనసంతా దిగులుగా ... గుబులుగా... గుండె బాధని మోయలేనంత బరువుగా అయింది.

"ఈ పక్షులది ఎంత అదృష్టం అనుకుంది. జత కట్టిన దగ్గర్నుంచి చనిపోయే వరకు కష్టసుఖాలని పంచుకుని కలిసే బతుకుతాయి. వార్ధక్యంలో విడివిడిగా బతకాల్సిన ఖర్మ వాటికి లేదు. ఎందుకంటే అవి మనుష్యులు కాదుకాబట్టి!

అదే నాగరికపు మనిషయితే బంధాలని.. బాంధవ్యాలని.... మమతలని... మమకారాలని... అభిమానాన్ని... అనురాగాన్ని డబ్బుతో పరిపోల్చి చూస్తాడు... భారం



పేరుతో విడదీస్తాడు. ఆ బాధ అనుభవించి తే తప్ప ఇతరులకు అర్థంకానిది.

కాయెప్పుడూ చెట్టుకి భారం కాదు. కాయే చెట్టుని భరించాల్సి వస్తే అది బరువే అవుతుంది కాబోలు అందుకే ఆ బంధం ముక్కలవకతప్పదు'' బాధగావిట్టూర్చింది.

ఆయన ఎలా వున్నారో? ఏమో? ఇంత వయసయినా తన ఆకలి తనే గుర్తించలేంత

అమాయకులు! వేళకి కాఫీలు... భోజనం అమరుతున్నాయో లేదో? రోజుకి నాలుగై దు సార్లయినా కాఫీ తాగుతారు. ప్రతిదానికి పార్వతీ! నా పెన్నెక్కడ? పార్వతీ నా కర్చీఫ్ ఏదోయ్! నా కళ్లద్దాలుఎక్కడో కాస్త చూపెడుదూ! ప్రతిదానికి తనమీదే ఆధారపడేవారు. ఆయన పనులు చేయడం తనకెంతో ఇష్టం... ఆనందం. "నేను బానే వున్నాను. మవ్వెలా వున్నావు పార్వతీ" అంటూ చాలా క్లుప్తంగా ఉత్తరాలు రాస్తున్నారు.

ఈ ఇల్లు... పరిసరాలు... పెరట్లో వున్న బాదంచెట్టు... వీధి కాంపౌండ్‌వాల్ లోపలున్న కొబ్బరిచెట్లు. ఈశాన్యమూలవ బావి... వాకిట్లో వున్న తులసికోట... నిండుగా పూచిన పూలతో తలలూపుతూ పలకరించే పూల మొక్కలు... అన్నీ తను కాపురానికి వచ్చినప్పటినుంచీ చూస్తున్నవే... తనకు సుపరిచితమే! ఇన్నేళ్లు తనకి సంతోషాన్ని... ఆహ్లాదాన్ని పంచి పెట్టినవే! ఈ మధ్య రెండు నెలలుగా వాటి ఉనికి చిరాకుని... కంపరాన్ని కలిగిస్తోంది.

ఒకటా రెండా వలభై ఏళ్లు మృగరాజులా తిరుగుతోంటే ఇంటికే ఎంతో అందం వచ్చినట్టుండేది. తన భర్త ఒక్కరే పదిమంది పెట్టు. ఎక్కడుంటే అక్కడే సందడి, సంతోషం కుప్పపోసినట్టుండేది. ఆ సంతోషం ఏది? ఆ ఆనందం అంతా ఏమైంది? ఎంతమంది వున్నా ఆయనలేని ఇల్లు బోసిగా వుంటోంది.

భర్తకి వంట్లో నలతగా వున్నట్టు నాలుగు రోజులుగా కల వస్తోంది. మనసుండబట్టక ఉత్తరం తెచ్చిపెట్టమని కొడుకుని అడిగింది పార్వతమ్మ. రోజూ మర్చిపోయానని దాటవేస్తున్నాడు కొడుకు. ప్చ్... తన కల సంగతి చెబితే తన కంగారుకి... ఆదుర్దాకి నవ్వుతాడేమోనని ఆమె అనుమానం.

తనివతలకి రాగానే కోడలన్నమాటలు చెవిన పడనే పడ్డాయి.

"హు... ముసలోళ్లకి దసరా పండగని! ఈ వయసులో మొగుడికి వారానికి ఒక ప్రేమలేఖ రాస్తోంది... ప్రేమలేఖ. వీళ్లకంటే పదుచువాళ్లే నయం" ఈసడింపుగాఅంది.

అదికాదు తన్ని బాధించింది! కొడుకు మౌనం! నిర్లిప్తత... మనసుని మెలితిప్పాయి. కంటిలో నీటిని నింపాయి.

నిజానికి తను పదుచు వయసులోకూడా ప్రేమలేఖలు రాయలేదు. భర్తని తలచుకోగానే వల్లమాలిన సిగ్గు ఎదురయ్యేది. నిజానికి ఆ వయసులో ప్రేమ ఎక్కడుంటుంది. వయసుపోరు... కోరికల జోరు తప్ప.

బిడ్డలు పుట్టిన తరువాతే వివాహబంధం పటిష్టమవుతుంది. సిగ్గుతెరలు తొలగిన భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోటానికి ... సాన్నిహిత్యాన్ని పెంచుకోటానికి... ప్రేమను పంచుకోటానికి ప్రయత్నిస్తారు. ఒకరి సమక్షంలో ఒకరు ఆనందాన్ని... తృప్తిని పొందుతారు.

ఏ జన్మలో ఏ జంటను విడదీసిన పాపమో ఈనాటికి శాపమైంది. పండుటాకుల్లా ఏ చిరుగాలికో రాలడానికి సిద్ధంగా వున్న ఈ ముసలి వయస్సున ఎడబాటు. శరీరాలు రెండైనా ఒకే ప్రాణంలా నలభై ఏళ్లు అన్యోన్యంగా కలిసి జీవించిన భర్తని ఒకసారి కళ్లారా చూడాలన్న కోరిక ఇంతై

వటుడింతై అన్నట్టు క్షణక్షణానికి పెరిగిపోతోంది ఆమెలో.

రెండు నెలలు రెండు యుగాలా అన్నంత భారంగా... చాలా నెమ్మదిగా కదులుతోంది కాలం.

ఆ రాత్రికి ఎలా అయినా కొడుకునడిగి వూరెల్లి భర్తని ఓసారి చూసిరావాలని నిర్ణయించుకుని తేలిగ్గా నిట్టూర్చింది పార్వతమ్మ చేట తీస్కొని ఇంట్లోకి వెళ్తూ.

పార్వతమ్మ... శివరామయ్యలకి ఇద్దరూ కొడుకులే. చేసేది ఎలిమెంటరీ స్కూల్ మాస్టర్ అయినా ఇద్దర్నీ బాగా చదివించి పెద్ద ఉద్యోగస్తుల్ని చేశారు.

ఆడపిల్లలు లేరని పార్వతమ్మ దిగులుపడుతోంటే... "కోడళ్లు వచ్చిన తరువాత ఆ ముచ్చట్లు జరుపుకోవచ్చులే!" నవ్వుతూ అనేవారు శివరామయ్య.

కోడళ్లు వచ్చారు... పార్వతమ్మ ముచ్చట్లు కలలుగానే మిగిలిపోయినాయి. పెద్దకోడలు రెండాకులు ఎక్కువే చదివింది. తను వేరేవూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మొగుడ్నికూడా లాక్కుపోయింది. చిన్నకోడలు ఆ వూళ్లోనే వేరుకాపురం పెట్టింది. అన్నేళ్ల కళ్లముందున్న కొడుకులు ఒక్కసారిగా దూరమైనందుకు ఆ ముసలి దంపతులు బాధపడినాచేసేదిలేక మిన్నకుండిపోయారు.

ఐదేళ్లు గడిచాయి. ముక్కుబడిగా చూసిపోయేవారు. చిన్నకొడుకుకూడా వేరే వూరికి ట్రాన్స్‌ఫరయిందన్నాడు. ఆస్తి పంపకం అన్నారు. దాంతోపాటు అమ్మా నాన్నలను కూడా పంచుకున్నారు. ఆర్నెల్లు వారికి గడువు పెట్టారు ఒక కొడుకు ఇంటినుండి మరో కొడుకు ఇంటికి మారడానికి.

ఆ సమయంలో నలభై ఏళ్ల అనుబంధాన్ని... విడదీస్తున్నామన్న ఆలోచనకంటే... హమ్మయ్య ఒకరి బరువు మాకు తగ్గింది అన్న ఆనందం కొడుకులు కోడళ్లు తేలిగ్గా ఊపిరి పీల్చుకునేలా చేసింది.

వూరెళ్తానని ఆ రాత్రి కొడుకునడిగింది పార్వతమ్మ. అంతే... ఇంతెత్తున ఎగిరాడు

## క్లోజ్

"మా డాడీ, మా మమ్మీ చాలా క్లోజ్‌గా వుంటారు"

"ఎలా"

"మా డాడీని మా మమ్మీ 'ఒరేయ్' అని పిలుస్తుంది"

—సిహెచ్.వి.వి.ఎస్.మూర్తి (సిల్ క్యాంపస్, పాల్వంచ)



''బావుంది... ఉత్తరం తేలేదని ఏకంగా వూరికి ప్రయాణం కట్టావన్నమాట. అయినా నాన్న వెళ్లి రెండునెలలేగా... ఏళ్లు అయినట్టు ఇప్పుడు అర్ధంతర ప్రయాణం ఏవిటి''

''నెలాఖరు. ఇంట్లో డబ్బేమైనా మూలుగుతోందా. ఇద్దరం పొద్దస్తమానం ఆఫీసులో పడి చాకిరీ చేస్తుంటే ఇల్లు గడవడమే కష్టంగా వుంది. ఎప్పుడు పడితే అప్పుడు ప్రయాణాలు చేయడాన్కి మా ఇంట్లో ఏమైనా చెట్టుందా?'' మూతి ముప్పై వంకర్లు తిప్పింది కోడలు.

మౌనంగా ఇవతలికొచ్చింది పార్వతమ్మ. ఆ రాత్రి ఆమె కంటినిండా కునుకు లేదు. భర్త రూపం పదేపదే ఆమె కళ్లల్లో మెదుల్తోంది. భర్త ఆలోచనలతోనే తెల్లారింది.

ఏమీ జరగనట్లు పనులు మామూలుగానే చేసుకుపోతోంది. తలారా స్నానంచేసి తులసికోటకి ప్రదక్షిణలు చేసింది.

కొడుకు, కోడలు ఆఫీస్‌కెళ్లిపోయారు. ఆమెకి భోంచేయాలనిపించలేదు. అలాగే మిగిలిన పనులు ముగించింది.

అలసటగా అన్పించి తులసికోటకి తల ఆన్చి కూచుంది. ఆమె కళ్లలో భర్తరూపం. ఇంత కాఫీకూడా ఇచ్చే దిక్కులేక నిస్త్రాణగా పడివున్నట్టు తోచింది. ఆమె గుండెల్లో దుఃఖం పొంగింది. బాధగా కళ్లు మూసుకుంది. మూసిన కళ్లనుండి వెచ్చటి కన్నీళ్లు వడలిన ఆమె చెక్కిళ్లనుండి జారాయి.

''ఏవండీ!... ఏవండీ! నేనండీ మీ పార్వతిని. శివరామయ్యని తట్టి లేపింది. భర్త దుస్థితికి ఆమెకి కన్నీరాగలేదు.

అంత నీరసంలోను ఆమెను చూసిన ఆయన కళ్లు హమ్మయ్య! నువ్వు వచ్చేశావుగా నాకు దిగుల్లేదు అన్నట్టు ఆనందంతో తళుక్కున మెరిశాయి.

ఆమె తలమీద చెయ్యేసి ఆప్యాయంగా నిమురుతూ ''ఎలా వచ్చావు పార్వతి! అబ్బాయి, కోడలు వప్పుకున్నారా? తన స్థితి అదే గాబట్టి ఆయన గొంతులో అనుమానం తొంగిచూస్తోంది.

''మొదట ఒప్పుకోలేదు! తరువాత ఏమనుకున్నారో ఏమో వెళ్లమన్నారు'' కళ్లు వత్తుకుంటూ చెప్పింది.

''పోనీలే! ఎలా అయితేనేం నువ్వు వచ్చేశావుగా! నాకు నిన్ను చూడాలని వుంది! నీతో మాట్లాడాలని వుంది. మనిద్దరం విడిపోయి కొన్ని యుగాలైనట్టుంది పార్వతి! అడిగితే వాళ్లేమంటారోనని'' ఆయన గొంతు రుద్ధమైంది.

భర్త ఆవేదనకి ఆమె కళ్లు గంగా గోదావరులైనాయి. భర్త రూపం మసగ్గా కన్పిస్తోంది.

''సర్లే! నిన్ను అనవసరంగా ఏడిపిస్తున్నట్టున్నాను. కాస్త కాఫీ చేసి తెచ్చిపెట్టు పార్వతి! నీ చేతి కాఫీ తాగి చాలా ఏళ్లయినట్టుంది'' జీవిత సహచరిపట్ల ప్రేమ... ఆరాధన... అభిమానం ఆయన గొంతులో పలుకుతోంది.

''అలాగేనండి!'' కళ్లు పైటచెంగుతో అద్దుకుంటూ వంటింట్లోకి వెళ్లింది.

మంచి కాఫీ చేసి తెచ్చి భర్తని లేపి కూచోబెట్టి కప్పు చేతికి అందించింది. శివరామయ్య తృప్తిగా తాగుతుంటే ఆమె

కళ్లల్లో నీళ్లు మళ్లీ నిండుతున్నాయి.

"అరే! ఎందుకు పార్వతీ! ఆ కన్నీరు. అసలు ఇప్పుడేమైందని అలా బాధపడ్తున్నావ్ ? ఓ వారం రోజులుగా కాస్త వళ్లు నెప్పబడుతోంది. అంతే... అబ్బాయికి కోడలికి నామీద ప్రేమ లేకకాదు. ఆఫీసు పనులతో వారికి తీరికుండక. పాపం వారు మాత్రం ఏం చేస్తారు చెప్పు. సిటీ లైఫంటేనే ఉరుకులు పరుగులు" సమర్ధింపుగా అన్నారు.

నీర్సంగా వున్న భర్తని చూస్తూ "మిమ్మల్ని అసలు చూస్తాననుకోలేదు" అంది కొంగులో కళ్లొత్తుకుంటూ.

విస్మయంగా... విచిత్రంగా భార్యకేసే చూశారు.

పసుపు రాసిన మొహానికి పావలా కాసంత కుంకుమ బొట్టు... మెళ్లో పసుపుతాడు... నల్లపూసలు... సగం నెరిసిన జుత్తుముడిలో ముద్దమందారం. చేతుల్నిండా మట్టిగాజులు... పసుపు పాదాలకి మట్టెలు... తెల్లరాయి ఒంటి ముక్కుపుడకతో పోటీ పడుతూ మెరిసే చిరునవ్వు.

"పార్వతి వొట్టి పిచ్చిది. ప్రతి చిన్న విషయానికి కంగారుపడుతుంది. ఇదే ఆఖరుచూపన్నట్టు అలా దీనంగా మాట్లాడుతుందేవిటి? అలా చూపులతోనే ఒళ్లంతా ఆర్తిగా తడుముతుందేమిటి" భార్య ప్రేమని మనసులోనే నవ్వుకున్నారు.

సాయంత్రం నాలుగ్గంటలవుతుండగా కొడుకు, కోడలు హడావిడిగా వచ్చారు.

"నాన్నా లేవండి" నిద్రపోతున్న తండ్రిని తట్టిలేపాడు కొడుకు. కోడలు నిలబడి చూస్తోంది.

శివరామయ్య కళ్లువిప్పి... అప్పుడే వచ్చారేంటి అన్నట్టు ప్రశ్నార్థకంగా చూశారు.

నాన్నా! లేవండి! ఓసారి అమ్మని చూసి వద్దాం! హడావిడిగా అన్నాడు.

"పిచ్చి సన్నాసి! ఇదంతా వాళ్ల అమ్మమీద బెంగవల్ల వచ్చిన జ్వరం అనుకుంటున్నాడు కాబోలు, ప్రయాణం అంటున్నాడు.

## ఉచిత సలహా



*ఈ మధ్య బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌గారు తన ప్రజలకో సలహా ఇస్తున్నారట! "మీరు తిండిలేక మాడినా ఫర్వాలేదు! ఐదు సంవత్సరాలు మీ పిల్లల్ని స్కూళ్లకు పంపండి — ఆ తర్వాత బీహార్‌లోని గుడిసెలన్నీ పక్కా బిల్డింగ్‌లుగా అయి తీరతాయి" అన్నది ఆయన స్లోగన్. బాగుందికదూ — పాపం... ప్రజలు!!*

— జూపిటర్

అప్పుడప్పుడూ చికాకు పడినా తన బిడ్డలు రత్నాలు'' మనసులో అనుకుని —

''ఆ అవసరం లేదు. మధ్యాహ్నం మీ అమ్మే వచ్చింది'' అన్నారు నవ్వుతూ.

షాక్ తగిలినట్టు చూశారు ఇద్దరూ. ''అమ్మ రావడం ఏమిటి నాన్నా'' అయోమయంగా వుందతడికి.

''అవున్రా కన్నా! నన్ను చూడాలన్పించిందిట. మీ తమ్ముడ్నడిగితే వెళ్లమన్నాట్ట. అంతే రెక్కలు కట్టుకొని వచ్చేసింది. అంతేకాదు. రాగానే నాకు మంచి కాఫీకూడా కలిపి ఇచ్చింది'' సంబరంగా అన్నారు.

మంచం ప్రక్కనే వున్న కాఫీ కప్పు చూసింది కోడలు. నిజమే తన్ని ఫ్లాస్కులో కాఫీ పోసి వుంచమన్నా 'గుర్రం గుడ్డిదైనా దాణాకేం తక్కువ కాదు' అని విసుక్కొని ఆఫీసుకెళ్లింది. ఇదేదో మాయలాగా వుందే అనుకుంది.

''నాన్నా అమ్మ ఇక్కడికిరాదు. రాలేదు. మీకు మగతనిద్రలో కల వచ్చివుంటుంది''

''కలకాదురా నిజమే. నిజంగానే వచ్చింది. నన్నుచూసి కన్నీరు పెట్టుకుంది. కావాలంటే ఈ కాఫీకప్పు చూడండి అన్నారు ఖాళీ కప్పు చూపుతూ.

''లేదునాన్నా! మీరేదో భ్రమలో వుండి మాట్లాడుతున్నారు. అమ్మ రాలేదు'' కొంచెం ఆగాడు.

''భ్రమకాదురా నిజంగానే వచ్చింది. కప్పు చూపించినా నమ్మడంలేదు. లోపల పనిచేస్తూ ఏ మూలో వుండి వుంటుంది. చూడండి — పార్వతీ ఓసారి ఇలారా'' లోపలికి కేకపెట్టారు. మళ్లీ పిలిచారు.

లోపలినుండి ఆ అలికిడి విన్పించలేదు. మీ అమ్మకి చెవుడు వచ్చినట్టుంది. లోపలికి పోయి మీరే చూడండి అన్నారు మళ్లీ.

లేదునాన్నా. అమ్మ... అమ్మ...!

''లోపలికెళ్లిచూడమంటే ఇక్కడే వుండి సణుగుతావేంట్రా''చిరుకోపంగా అన్నారు.

''ఉదయం పదకొండున్నరకి అమ్మ చనిపోయిందట నాన్నా'' తమ్ముడు టెలిగ్రాం ఇచ్చాడు'' తల దించుకుని నెమ్మదిగా చెప్పాడు.

హా... పార్వతి చనిపోయిందా... నా పార్వతి చనిపోయిందా... ఆయన కళ్ల కదలికలు ఆగిపోయి అలానే శూన్యంలోకి చూస్తుండిపోయాయి. తన జీవన సహచరి... ప్రేమమూర్తి పార్వతి ఎక్కడేనా కనిపిస్తుందేమోనని ఆశగా వెతుకుతూ.

